క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



జ్యోతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న మండలంలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం తుమురుగోటి జ్యోతిని గురువారం పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత జ్యోతి మాట్లాడుతూ.. అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థుల కోసం నిరంతరం శ్రమిస్తామని అన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్‌, ఉపాధ్యాయులు పాపని బాలకృష్ణ, వీరయ్య, లావణ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

దేవరకొండ : ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్డీఓ గోపిరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. అరకొర వసతులు, నాణ్యమైన భోజనం అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోపిచంద్‌, గోపి, ప్రభు, రాకేష్‌, అఖిల్‌, ఈశ్వర్‌, గణేష్‌, కావ్య, తదితరులున్నారు.

లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా లక్ష్మి



డిండి : మండల పరిధిలోని ప్రతాప్‌నగర్‌ సర్పంచ్‌ జరుపుల లక్ష్మీతిర్పతి లంబాడీ ల ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ జాదవ్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కర్నాటి సురేష్‌



దేవరకొండ : పట్టణానికి చెందిన న్యాయవాది కర్నాటి సురేష్‌ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం సురేష్‌కు నియామక పత్రం అందజేశారు.

రైతుబంధు వర్తింపజేయాలని వినతి

చందంపేట : మండలంలోని కంబాలపల్లి, రేకులగడ్డ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమకు రైతు బంధు పథకం వర్తింపజేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్‌, డిఫార్మర్‌ పట్టాలు కలిగి ఉన్న రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో రైతు బంధుకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ఎలుక జలంధర్‌గౌడ్‌, గోవిందు, అంజయ్య, అంజయ్య, కొండయ్య పాల్గొన్నారు.

మతోన్మాదులను శిక్షించాలి

హాలియా : నిజామాబాద్‌ జిల్లా కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన దళిత ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌ను కులం పేరుతో దూషించి బలవంతంగా గుడికి తీసుకెళ్లి బొట్టుపెట్టి అవమానించిన మతోన్మాద బీజేపీ, వీహెచ్‌పీ దుండగులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను డిమాండ్‌ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఘటనలో పాల్గొన్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్‌ చేశారు. సమావేశంలో కందుకూరి కోటేష్‌, శివ, రాము, పుల్లయ్య ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్‌ : బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐఏఎస్‌లకు కీలకశాఖల్లో ప్రాధాన్యత కల్పించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం పట్టణంలోని సాగర్‌ రోడ్డులో గల మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ఐఏఎస్‌లకు వారి సామర్థ్యాన్ని బట్టి పోస్టులను కేటాయించకుండా కేవలం కొన్ని వర్గాల వారికి కీలక పోస్టుల్లో నియమించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, జయమ్మ, శ్రీనివాస్‌యాదవ్‌, ఫారూఖ్‌, కవిత, మురళి, సతీష్‌ ఉన్నారు.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

- పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఒక్కో రైతు వేదిక ఖర్చు రూ.21లక్షలు
- అందుబాటులోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : వ్యవసాయంలో ఆధునిక పోకడలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలు అలంకారప్రాయంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 5వేల మంది రైతులకు ఒక రైతు వేదికను ఏర్పాటు చేయాలని సూచించింది. దీంతో మండలంలోని మూడు క్లస్టర్లు తిరుమలగిరి, నెల్లికల్లు, కొంపల్లి గ్రామాల్లో ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణాలను చేపట్టింది. ఈ నిర్మాణాలు పూర్తయి సంవత్సరం దాటినా నేటికి ప్రారంభానికి నోచుకోవడంలేదు. పంటల సాగు విధానం, వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ రైతు వేదికల నిర్మాణాలను చేపట్టారు. ఒక్కో భవనం రూ.21లక్షలతో మండలంలో మొత్తం రూ.63లక్షలతో మూడు రైతు వేదికలను నిర్మించారు.

అవగాహన కరువు..

రైతులంతా ఒకే దగ్గర కూర్చొని పంటలపై చర్చించుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఈ రైతుల వేదికలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో వ్యవసాయ విస్తర్ణ అధికారి కార్యాలయం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడి కార్యాలయంతో పాటు మీటింగ్‌ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్ల



కొంపల్లిలో పూర్తయిన రైతువేదిక

వ్యవసాయ విస్తర్ణ అధికారి ఆ క్లస్టర్ల రైతులకు సాగుపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. దీంతో మండలంలో ఎక్కడా ప్రారంభం కాకపోవడంతో వ్యవసాయ విస్తర్ణ అధికారులు వ్యవసాయశాఖ కార్యాలయాలనికే పరిమితం అవుతున్నారు. అలాగే రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఉత్సవ విగ్రహాలుగానే ఉండాల్సిన పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు వేదిక వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లేకపోవడంతో ఆ రైతు వేదికను కార్యాలయంగా మార్చారు. కొంపల్లి, నెల్లికల్లు గ్రామాల్లోని రైతు వేదికలు అంతా సిద్ధమై ప్రారంభానికి నోచుకోక ఎదురుచూస్తున్నారు. ఇన్ని లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన రైతు వేదికలు నిరుపయోగంగా ఉండటంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వినియోగంలోనికి వస్తే రైతులు వేయాల్సిన పంటల రకాలు, సస్యరక్షణ చర్యలు, మందులు వాడాల్సిన మోతాదులపై అవగాహన కల్పించేందుకు వీలుండనుంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రైతు వేదికలను వినియోగంలోనికి తీసుకురావాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



ప్రజాధనంతో ఏర్పాటు చేసిన రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకురావాలి. రైతులు వేదికలు పూర్తై ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగంగా ఉంచడంతో రైతుల సూచనలు, సలహాలు కోల్పోతున్నారు. పంటలను సాగుచేసే విధానం, రసాయనాల వినియోగం, తెగుళ్ల నివారణ, పంటల కాలాలు వంటి తదితర వ్యవసాయ సంబంధిత వివరాలను వ్యవసాయ అధికారులు సూచించాలి. అధికారులు స్పందించి వెంటనే రైతు వేదికను ప్రారంభించాలి.

– కాంసాని చంద్రశేఖర్‌, రైతు, బోయగూడెం

పనులు పూర్తి చేశాం



ప్రభుత్వం మంజూరు చేసిన రైతు వేదికలకు సంబంధించినటువంటి భవన నిర్మాణ పనులు ఎప్పుడో పూర్తయ్యాయి. రైతు వేదిక ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రైతులు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా పెద్ద హాలు, వ్యవసాయ విస్తర్ణ అధికారి కార్యాలయం, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్‌ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఇవి రైతులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

– పమ్మి జనార్దన్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్‌

పోలీసులు ప్రజల మన్ననలు పొందాలి

- జెడ్పీ వైస్‌చైర్మన్‌ ఇరిగి పెద్దులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పోలీసులు నిజాయితీగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని జెడ్పీ వైస్‌చైర్మన్‌ ఇరిగి పెద్దులు అన్నారు. ఉత్తమ సేవలు పోలీస్‌ వర్టికల్స్‌లో ప్రతిభావంతమైన సేవలు అందించినందుకు గాను మండల పోలీస్‌స్టేషన్‌ రాష్ట్రంలో ఎనిమిదో స్థానం, జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. దీంతో స్థానిక ఎస్‌ఐ పెదపంగ బాబును నియోజకవర్గ దళిత ఉద్యోగుల సంఘం నాయకులు మందా సైదులురావు గౌతమ్‌ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐ బాబును పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్‌ పెద్దులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికయ్యేలా కృషి చేసిన ఎస్‌ఐని ఆయన అభినందించారు. మునుముందు కూడా నిరుపేద ప్రజలకు పారదర్శకంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొంది రాష్ట్రంలో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌



ఎస్‌ఐ బాబును సన్మానిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్‌ పెద్దులు తదితరులు

అవార్డును స్వీకరించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ ఆదెపు రామలింగయ్య, హాలియా మున్సిపల్‌ కౌన్సిలర్‌ అన్నెపాక శ్రీనివాస్‌, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు యడవల్లి రాంబాబు, మిర్యాలగూడ డివిజన్‌ విద్యుత్‌ ఉద్యోగుల సంఘం నాయకులు యడవల్లి సోమశేఖర్‌, ఎంపీటీసీలు కాశయ్య, కృష్ణారావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

హాలియా : పట్టణంలోని హాలియా పబ్లిక్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్‌ సైన్స్‌ ఒలింపియాడ్‌ ఫస్ట్‌ లెవల్‌ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి సెకండ్‌ లెవల్‌ పరీక్షకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్‌ మోహన్‌రావు గురువారం తెలిపారు. సైన్స్‌ ఒలింపియాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫస్ట్‌ లెవల్‌ పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌.లక్ష్మి, స్ఫూర్తి, చారీ, అక్షిత పాల్గొని సెంకడ్‌ లెవల్‌ పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్‌ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్‌ గోపినాయర్‌, సైన్స్‌, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి

- మాజీ ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి

పెద్దవూర : మండలంలోని తన స్వగ్రామమైన పిన్నవూర గ్రామపంచాయతీని జిల్లాలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పిన్నవూరలో ఎంపీడీఓ కె.విజయకుమారి సమక్షంలో సర్పంచ్‌ కసిరెడ్డి అనితామేఘశ్యాంరెడ్డికి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి తన నిధుల నుంచి మంజూరైన రూ.90.91లక్షల ప్రతిపాదనల పత్రాలను అందించి మాట్లాడారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధి పథకం (సీడీపీ) కింద తన నిధుల నుంచి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఇటీవల రూ.90.91లక్షలను మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, రూ.20లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు, రూ.20లక్షలతో గ్రామపంచాయతీ ప్రహరీ పనులు, క్రిమిటేరియా కాంపౌండ్‌ వాల్‌ నిర్మాణానికి రూ.15లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5.91లక్షలు మంజూరు అయినట్లు



అభివృద్ధి పనుల మంజూరు పత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి

తెలిపారు. పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో బృహత్‌ పల్లెప్రకృతి వన సంరక్షణకు సంబంధించి నిధులు లేవని ఎంపీడీఓ కోరగా ఆయన స్పందించి సొంతంగా రూ.5లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇంకా గ్రామాభివృద్ధికి ఏమైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కసిరెడ్డి అనిత, మేఘశ్యాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌

చందంపేట : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. గురువారం నేరెడుగొమ్ము మండలంలోని బచ్చాపురంలో రూ.20లక్షలతో, పెద్దమునిగల్‌ గ్రామంలో రూ.20లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాణావత్‌ పద్మ, జెడ్పీటీసీ బాలునాయక్‌, వైస్‌ ఎంపీపీ ఆరెకంటి ముత్యాలమ్మ, సర్పంచ్‌లు అంజయ్య, బషీర్‌, నాగు, చెన్నకేశవులు, ఎంపీటీసీ బిక్కునాయక్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ ముక్కమల చినబాలయ్య, పంచాయతీరాజ్‌ డీఈ లింగారెడ్డి, ఏఈ రాజు, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, నాయకులు కొండల్‌రెడ్డి, బాషోజీ, బొడ్డుప ల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చందంపేట : సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌



దేవరకొండ : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

దేవరకొండ : సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. గురువారం పీఏపల్లి మండలానికి చెందిన పలువురు నాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పీఏపల్లి మండలం అజ్మాపురం సర్పంచ్‌ నగేష్‌, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ రామకృష్ణచారి, వార్డు సభ్యులు రమాదేవిశ్రీనివాస్‌లతో పాటు పలువురు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్‌ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ వల్లపురెడ్డి, అర్వపల్లి నర్సింహ, గుండాల శ్రీనివాస్‌, ఎర్ర యాదగిరి, గోవర్ధన్‌, శ్రీనివాస్‌, నరేందర్‌, కర్ణయ్య, నిరంజన్‌, తదితరులున్నారు.

కేసీఆర్‌ పాలనకు చరమగీతం పాడడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత కవిత

అడవిదేవులపల్లి : వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ కుటుంబ పాలనకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్‌, ప్రముఖ సినీ నటి కవిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ బూత్‌ కమిటీల ఇన్‌చార్జ్‌లతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్‌ స్థాయి నుంచి బీజేపీ పార్టీని పటిష్టపరిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే విధానాలపై ప్రజల పక్షాన నిలిచి ఉద్యమించేందుకు సిద్ధం కావాలన్నారు. అనంతరం మండల కేంద్ర సమీపంలో చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ బీజేపీ నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నేత సాధినేని శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ కన్వీనర్‌ బాణావత్‌ రతన్‌సింగ్‌నాయక్‌, కిసాన్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు చిల్లంచర్ల అభి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దింటి కొండల్‌, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రవిచంద్ర, సైదయ్య, మంగ్త, రమేష్‌ తదితరులున్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్‌ : తెలంగాణలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు సంఘం నాయకులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్‌ అన్నారు. గురువారం పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. సంఘం నియోజకవర్గ కన్వీనర్‌ పున్నా రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు తిరందాసు వేణుగోపాల్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాపోలు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రావిరాల శ్రీనివాస్‌, కోశాధికారి చిలువేరు భిక్షం, కొంగరి నారాయణ, బ్రహ్మం, రవికుమార్‌, వినోద్‌, ప్రేమ్‌, నరేష్‌, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రావిరాల శ్రీలత, ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్‌, చంద్రశేఖర్‌, కిరణ్‌, నాయకులు తదితరులున్నారు.

పాండరయ్య మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

గుర్రంపోడు : మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కుంచకూరి పాండరయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహాన్ని శాసనమండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు సాదం సంపత్‌కుమార్‌, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, వైస్‌ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ, మండల ప్రధాన కార్యదర్శి రామగిరి చంద్రశేఖర్‌రావు, నాయకులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోని ప్రభుత్వం

మిర్యాలగూడ అర్బన్‌ : సంక్షేమ హాస్టళ్లను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్‌, మెస్‌ చార్జీలను పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్‌ డిమాండ్‌ చేశారు. గురువారం స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, కాని సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచడంలేదని, దీంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్‌ పోస్టులు తక్షణమే



ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్‌ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.అంజాద్‌, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుర్ర సైదానాయక్‌, వదూద్‌, జగన్‌నాయక్‌, వీరన్న, సంపత్‌, సమ్మద్‌, ఉపెందర్‌, కోటేష్‌, తరుణ్‌, ఆనంద్‌ తదితరులున్నారు.

చదువుల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలి

నాగార్జునసాగర్‌ : విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని విజయపురి టౌన్‌ ఎస్‌ఐ రాంబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక సెయింట్‌ జోసెఫ్‌ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఖోఖో కోర్టును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల్లో క్రమశిక్షణ లోపిస్తే తల్లిదండ్రులనే బాధ్యులను చేస్తామన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవహర్త విజయప్రభావతి, హెచ్‌ఎం సుందరి, సిస్టర్‌క్లారా, హనుమకుమార్‌, పీఈటి కిరణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో కోర్టును ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాంబాబు

గ్రామపంచాయతీ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కొండమల్లేపల్లి : గతంలో గ్రామపంచాయతీ లే-అవుట్‌ ప్రకారం చేసిన వెంచర్లలో గ్రామపంచాయతీకి ఇచ్చిన భూమిని తిరిగి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సర్పంచ్‌ కుంభం శ్రీనివాస్‌గౌడ్‌ గురువారం పేర్కొన్నారు. 20ఏళ్ల క్రితం చేసిన జేబీ వెంచర్‌లో గ్రామపంచాయతీకి కేటాయించిన భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో సర్పంచ్‌, పాలకవర్గం సభ్యులు అడ్డుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌ అందుగుల ముత్యాలు, అంకిశెట్టి శేఖర్‌, ముచ్చర్ల యాదయ్య, రావుల సత్యనారాయణ తదితరులున్నారు.

మెగా హెల్త్‌క్యాంపు కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

హాలియా : దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య 67వ జయంతి సందర్భంగా నోముల ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 8న పట్టణంలో నిర్వహించతలపెట్టి మెగా హెల్త్‌క్యాంపును విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సాదం సంపత్‌కుమార్‌ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి హెల్త్‌ క్యాంపుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌లో నిర్వహించే మెగా హెల్త్‌ క్యాంపులో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనుముల, హాలియా నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌ట్రాప్‌ చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి


దేవరకొండ : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ ఫోన్‌ట్రాప్‌ చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు డిమాండ్‌ చేశారు. గురువారం పట్టణంలో బీఎస్పీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో డా.బీఆర్‌ అంబేద్కర్‌ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ రమావత్‌ రమేష్‌నాయక్‌ మాట్లాడారు. అనంతరం దేవరకొండ సీఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా కన్వీనర్‌ లలిత, నాయకులు యాదయ్య, మొగులి, శ్రీకాంత్‌, దయాకర్‌, జానీ, నాయకులు తదితరులున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

→ క్యాలెండర్ల ఆవిష్కరణ



చింతపల్లి : క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కొండూరు భవానీ తదితరులు

చింతపల్లి : మండల పరిధిలోని మాల్‌ వెంకటేశ్వరనగర్‌లో పీఆర్టీయూ–2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ కొండూరు భవానీ, ఎంఈఓ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్‌ అధికారి శరత్‌యామిని, మండల అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్‌కుమార్‌, కిరణ్‌కుమార్‌, ఆంజనేయులు, శేషు, మల్లిఖార్జున్‌ పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలో బీసీ యువజన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి పాలగాని శంకర్‌గౌడ్‌ మాట్లాడారు.. కార్యక్రమంలో సందీప్‌, సాయి, శ్రీను పాల్గొన్నారు.

→ నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దవూర : మండలంలోని ఆయా గ్రామాల్లో నేడు ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు జటావత్‌ రవినాయక్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

→ ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

మిర్యాలగూడ టౌన్‌ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి కేక్‌ కట్‌ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ వీరారెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు పి.కరుణాకర్‌రావు, ఏపీఓ మగిడిమర్రి శిరీష, సీనియర్‌ అసిస్టెంట్‌ భరద్వాజ్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ పోషయ్య, ఫిరోజ్‌, రేణుక, కళావతి, రాజేశ్వరి, అండాలు తదితరులున్నారు.

→ బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన మజ్జిగపు లక్ష్మారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో నిడమనూరు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మర్ల చంద్రారెడ్డి అతడి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నగిరి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

→ మైనర్లను పనిలో చేర్చుకుంటే చర్యలు

కొండమల్లేపల్లి : మైనర్‌ బాల, బాలికలను పనిలో చేర్చుకుంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్థానిక ఎస్‌ఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని హైదరాబాద్‌ రోడ్డులోని శ్రీ కనకదుర్గ ఇంజనీరింగ్‌ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న మైనర్‌ బాలుడిని ఆపరేషన్‌ స్మైల్‌లో భాగంగా గుర్తించినట్లు తెలిపారు.

→ బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

మిర్యాలగూడ : టీఎల్‌ఎం మేళాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎన్‌బీఆర్‌ ఫౌండేషన్‌ తరుపున పంపిన బహుమతులను గురువారం ఎంఈఓ బాలాజీనాయక్‌ అందజేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

చింతపల్లి : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. గురువారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో పీడీఎస్‌ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు, ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసినట్లు తెలిపారు. ఆయన వెంట నాంపల్లి సీఐ విఠల్‌రెడ్డి, ఎస్‌ఐ రమేశ్‌, సిబ్బంది ఉన్నారు.

మట్టపల్లిలో ఎమ్మెల్యే భగత్‌ పూజలు

మఠంపల్లి : ప్రసిద్ధి గాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని గురువారం నాగార్జునసాగర్‌ ఎమ్మెల్యే నోముల భగత్‌ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను అర్చకులు సాదరంగా ఆహ్వానించి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాబాచార్యులు, యాదవ అన్నదానం సత్రం సభ్యులు పాల్గొన్నారు.